# 19

# జ్ఞానోదయం

"ఏంటమ్మగారూ! మీరిప్పుడుచదువుకుంటారా? పరీక్షలు రాస్తారా?" నమ్మలేనట్టుగా చూస్తూ కళ్ళింత చేసుకుని అడిగింది రంగి.

"ఔను... ఎందుకంత ఆశ్చర్యంగా అడుగుతున్నావు?" నవ్వింది అరుణ.

"పెళ్ళికిముందు కొంచెం చదువుకున్నారు కదా... ఇప్పుడు పెళ్ళయిపోయాక ఓ పాపకి తల్లి కూడా అయ్యాక ఇంకెందుకమ్మా చదువుకోడం?" అయోమయంగా అర్థం కానట్టు చూసింది.

"భలే దానివే... పెళ్ళయిపోతే చదువుకోకూడదని రూలుందా? చదువుకోవాలన్న ఆసక్తి ఉంటే వయసుతో సంబంధం లేదు రంగీ. ప్రైవేట్‌గా పరీక్షలకి కడతాను. నీకు చదవడం రాయడం వొచ్చా?"

"రాదమ్మా... నేనేం చదువుకోలేదు".

"తొందరపడి పెళ్ళి చేసేశారు మీ వాళ్ళు నీకు. నువ్వు చదువుకుంటానంటే చెప్పు... నీ పన్లన్నీ అయ్యాక నీకు ఏ టైములో కుదురుతుందో ఆ టైములో రోజూ చదువు నేర్పిస్తాన్నీకు".

"ఎందుకమ్మా? ఏవీ చదువుకోకుండానే నాలుగిళ్ళల్లో పనిచేసి సంపాయించుకుంటున్నాను కదా?"

"విద్య అనేది డబ్బు సంపాదనకి మాత్రమే కాదు రంగీ! విజ్ఞానం పెరుగుతుంది విద్యతో. మంచి ఆలోచనా పద్ధతి, అవగాహనా శక్తీ కూడా పెరుగుతాయి. దానివల్ల నిన్ను నువ్వేకాదు నీ కుటుంబాన్ని అంతటినీ కూడా చక్కగా తీర్చిదిద్దుకోగలవు".

"చాల్లేమ్మా... ఇప్పుడు నేను అ ఆలు రాయడం మొదలుపెడితే నలుగురూ నవ్వుతారు".

"ఎందుకు నవ్వుతారు? ఒకవేళ ఎవరైనా నవ్వితే వాళ్ళకి చెప్పు విద్యలేని వాడు వింత పశువని".

"అదేవిటో దానర్థం నాకు తెలిస్తే కదా వాళ్ళకి చెప్పడానికి..."

"అంటే... చదువుకోనివాడు విచిత్రమైన జంతువులాంటి వాడన్నమాట".

"పొండమ్మా! మీరు మరీను. ఎంత చదూకున్నా ఆడదానికి ఇల్లూ పిల్లలూ తప్పుతుందా? ఆ మాత్రానికి చదువులెందుకూ దండగ" గొణుక్కుంటూ తన పనిలో పడింది రంగి.

ఇంటికెళ్ళగానే ముందు వాళ్ళాయన నాగరాజుతో ఈ వార్తే చెప్పింది.

"కొందరికి సుకపడటం తెలియదే రంగీ! ఇప్పుడా అమ్మకి పెళ్ళికావాల్నా ఏమన్నానా? ఇంకా పెద్ద చదువు చదువుకుంటేగానీ పెళ్ళి కాదన్న భయమేం లేదు కదా? పెళ్ళయి పిల్ల తల్లి కూడా అయినాక ఇప్పుడివేం పోకడ చెప్పు. ఫ్యాషనెక్కువైనాయి ఆడంగులకి ఫ్యాషన్లు..."

"బాగా చెప్పావు మావా, ఫ్యాషన్ కాకపోతే ఇప్పుడెందుకుటా ఆ చదువు?" తందాన తాన అంటూ తాళం వేసింది రంగి.

✧ ✧ ✧

'తను డిగ్రీ చేసి మీతో సమంగా నేనూ చదువుకున్నానండోయ్ అని గొప్పలు చెప్పుకోవడానికా అరుణ ఇప్పుడు పరీక్షక్కట్టింది' అన్న అనుమానం అరుణ భర్త రామారావు మనసులో చోటు చేసుకుంది. ఇంక ఉండబట్టలేక ఒకరోజు అనేశాడు "ఇప్పుడెవర్ని ఉద్ధరించాలని చదువులు మొదలెట్టావు? చదవమని నేనేం అనలేదుగా?"

"మీరనకపోయినా చదువుపట్ల ఉన్న ఆసక్తితో మొదలెట్టానండీ. కనీసం డిగ్రీ అయినా చేశాక పెళ్ళి చేసుకుంటాను. ఈ లోపల వొద్దని నాన్నగారితో చెప్పినా వినిపించుకోలేదాయన. పెళ్ళయిన మరుసటి సంవత్సరమే పాప పుట్టింది కదా. దానికి నాలుగేళ్ళన్నా వొచ్చేదాకా నా చదువు వాయిదా వేసుకోవాలన్న నిర్ణయంతో ఇన్నాళ్ళూ ఆగాను".

"అయితే మాత్రం? ఇప్పుడు చదువుతో నీకేవిటవసరం?"

"అలా అంటారేవిటండీ? చదువన్నది పెళ్ళికోసమే కాదండీ. పెళ్ళయిపోయింది కదా ఇంక చదువులెందుకని అనుకుంటే ఎలా? జీవితానికి వెలుగిచ్చే గొప్పతనం విద్యలో ఉంది. బతుకులో మంచీ చెడులు బేరీజు వేసుకోడానికి వివేకాన్నిస్తుంది విద్య".

"లెక్చర్ ఇస్తున్నావా నాకు?" కాస్త కోపం కాస్త ఎగతాళి మిళితమయ్యాయి రామారావు గొంతులో.

అదేమీ పట్టించుకోకుండా సహనంతో ఓర్పుతో తాను చెప్పదలచుకున్నది చెప్పింది అరుణ. "గృహిణి చదువుకోవడం వల్ల కుటుంబానికంతటికీ లాభమేగానీ నష్టం లేదు. మీరెందుకు వ్యతిరేకత చూపిస్తున్నారో నాకు అర్థం కావట్లేదు. రేపు మన పాపకి చిన్న తరగతులనించే ట్యూషన్లకి డబ్బు ఖర్చు పెట్టక్కర్లేకుండా నేను చదువు చెప్పుకోగలుగుతాను. ఓపిక, సమయం ఉంటే ఇరుగు పొరుగు పిల్లలకి ఇంట్లో కూచునే ట్యూషన్లు చెప్పి నాలుగు డబ్బులు సంపాదించగలుగుతాను కదా! దొంగలెత్తుకుపోలేనిది విద్య ఒక్కటేనండి. అది చేతిలో ఉంటే ఏ వ్యక్తికైనా సరే ఎలాంటి కష్టనష్టాల్లోనూ కూడా బతగ్గలననే ధైర్యం వొస్తుంది".

"నీకేం కష్టనష్టాలొచ్చాయిప్పుడు?" విసుగ్గా అంటూ విసురుగా బయటికి వెళ్ళిపోయాడు రామారావు.

అతని ప్రశ్నకి ఏడవాలో నవ్వాలో తెలియలేదు అరుణకి.

"అన్నయ్య అర్థం చేసుకోకుండా మాట్లాడుతున్నాడు. చదువుపట్ల నీకున్న ఆసక్తి గమనించట్లేదు తను. ఇంట్లో మగవాడు చదువుకున్న వాడైతే అతని మటుకే అది... అతనివరకే పరిమితమవుతుంది.... గృహిణి చదువుకున్నదైతే కుటుంబాని కంతటికీ అన్నివిధాలా ఉపయోగం ఉంటుంది. ఈ మాత్రం తెలుసుకోలేకపోతున్నా దన్నయ్య. నీకు నా సపోర్టు ఎప్పుడూ ఉంటుంది వదినా. డిగ్రీ చెయ్యి. ఆ తర్వాత పి.జి. కూడా చెయ్యి" ఆడబడుచు విమల మాటలకి తేరుకుంది అరుణ. ఆప్యాయంగా ఆమె చెయ్యి అందుకుని కృతజ్ఞతలు చెప్పింది. ఇంటర్ చదువుతున్న చిన్న పిల్ల అయినా విమల తనని అర్థం చేసుకున్నందుకు సంతోష పడింది.

ఇంట్లో తను చెయ్యవలసిన పనుల్లో ఏలోటూ రాకుండా చూసుకుంటూ ప్రతిరోజూ మధ్యాహ్న సమయాల్లోనూ, రాత్రిళ్ళు కొంతసేపూ కూచుని ఏకాగ్రతతో చదువుకుంటూ ప్రైవేట్‌గా డిగ్రీ పూర్తి చేసింది అరుణ.

పైకి బింకంగా ఉన్నా భార్య పట్టుదలకి తెలివి తేటలకి మనసులో మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు రామారావు. అది పైకి ప్రకటించడానికి కొద్దిగా అహం అడ్డొచ్చింది.

✧ ✧ ✧

"మీ ఇంట్లో పనిచేయడం అయిపోయినాక రోజూ నాకు చదవడం రాయడం నేర్పించండమ్మా".

"అయ్యో! అదెంత భాగ్యం... అలాగే నేర్పిస్తాను. దానికేడుస్తావెందుకు రంగీ?" కంగారుపడుతూ అడిగింది అరుణ.

"ఏడవకేం చెయ్యమంటారమ్మా? చదువునేర్పిస్తానని ఎంతో అభిమానంగా మీరడిగినప్పుడు పిచ్చిమాటలుగా తీసిపడేశాను. నా తెలివి తక్కువకి ఏడుస్తున్నానిప్పుడు".

"ఏమైంది రంగీ? అసలేం జరిగింది?"

"మొన్నామధ్యన మా ఆయనకి జబ్బు చేసినప్పుడు చుట్టాలాయన దగ్గిర సొమ్ము అప్పుగా అడిగానమ్మా. కాయితమ్మీద వేలిముద్ర వేయించుకుని పైకం ఇచ్చాడు. నాకు చదువు రాదాయె. దానిమీదేం రాశాడో నాకేం తెల్సు. నిన్ననొచ్చి మా గుడిసె ఖాళీ చెయ్యమని కూచున్నాడు. ఆయనకి మా గుడిసె అమ్మేసి నేను సొమ్ము తీసుకున్నట్టుగా రాశాడందులో. చదివి వినిపించాడు మాకు. ఇంత అన్యాయం ఎక్కడైనా ఉంటుందామ్మా?

"అప్పుడేం చేశారు మీరు?" ఆదుర్దాగా అడిగింది అరుణ.

"కాళ్ళమీదపడ్డాం. ఏడిచాం. వినిపించుకోలేదామనిషి. ఇరుగు పొరుగందరూ వొచ్చేశారు. నానా గోల అయ్యింది. పంచాయితీ పెట్టారు. చివరికి వడ్డీ బాగా ఎక్కువిస్తాం అంటే ఒప్పుకుంటానన్నాడు. లేదంటే గుడిసె తనదే అన్నాడు. ఆ రకంగా రాజీపడ్డాం. ఏం చేస్తాం మరి? వడ్డీ ఎంతైనా కట్టుకోవల్సిందే, చదవడం రాకపోతే

ఎవరైనా ఎన్ని మాయలైనా చేసేస్తారని అర్థమైందమ్మా. బాగా బుద్ధొచ్చింది. నా కూతుళ్ళిద్దరికీ ఈ గతి పట్టకూడదని రేపట్నించీ బడికి పొమ్మని చెప్పాను. ఎవరి చేతుల్లోనూ మోసపోకుండా తెలివిగా మంచితనంతో బతకండి బాగా చదువుకుని అని చెప్పాను".

"చాలా మంచి మాట చెప్పావు రంగీ. ఈ రోజునించే నీకు అక్షరాలు నేర్పిస్తాన్నేను. తొందరగా చదవడం రాయడం వొచ్చెయ్యాలి. సరేనా?"

"సరేనమ్మా" కొద్దిగా సిగ్గుపడుతూ చిరునవ్వు నవ్వింది రంగి.

✧ ✧ ✧

ఆ రోజు పొద్దున్న పక్కింట్లోంచి హఠాత్తుగా ఏడుపులు వినిపిస్తుంటే కంగారు పడుతూ హడావిడిగా వాళ్ళింటి గుమ్మంలోకెళ్ళింది అరుణ. పక్కింటాయన స్కూటర్ యాక్సిడెంట్లో ఆన్‌ది స్పాట్ చనిపోయాడని ఆఫీసునించి ఫోనొచ్చిదట. నమ్మలేకపోయింది. ఎంతఘోరం? తిని తిరుగుతున్న మనిషి... పొద్దున్నే ఆఫీసుకని వెళ్ళినవాడు... ఆఫీసు గేటుదగ్గిరే యాక్సిడెంట్లో పోవడం... నిండు ప్రాణం బలైపోయింది. ఇంటినుంచి బయటికెళ్ళినవాళ్ళు మళ్ళీ ఇంటికి చేరేదాకా నమ్మకం ఉండట్లేదు... రోజులలా ఉన్నాయి... ముగ్గురు పిల్లల తండ్రి... ముగ్గురూ చిన్నపిల్లలే. స్కూల్లో చదువుతున్నారు... వాళ్ళని చూస్తుంటే మనసు కలచి వేసినట్లయింది. ఆయన భార్య శ్యామలని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

✧ ✧ ✧

ఓ రోజు శ్యామలకి జ్వరంగా ఉందని తెలిసి ఏదైనా సాయం చేద్దామని వాళ్ళింట్లోకి వెళ్ళింది అరుణ.

అరుణని చూస్తూనే కళ్ళనీళ్ళు పెట్టుకుంది శ్యామల. తాను చదువుకున్నదైతే వాళ్ళాయన ఆఫీసులో ఏదో ఒక ఉద్యోగం ఇచ్చేవారని తానేమీ చదువుకోకపోవడం వల్ల ఆ అవకాశం తనకి లేకపోయిందని చెప్పుకుని ఏడ్చింది. చదువుకి ప్రాధాన్యం ఇవ్వకుండా చిన్నవయసులోనే తనకి మల్లే ఎవ్వరూ పెళ్ళిచేసుకోకూడదని ఆ భగవంతుడిని ప్రార్థించింది. బాధపడింది.

"రోజులు మారాయి శ్యామలగారూ... ఇదివరకటి కుటుంబ పరిస్థితులు లేవిప్పుడు, సమాజంలో. ఒక్కరు సంపాదిస్తే పదిమంది తినగలిగేవారు ఆ రోజుల్లో. ఈ రోజుల్లో అలా ఉన్నవాళ్ళకి చాలా కష్టంగానే ఉంది. ప్రతి ఒక్కరూ చదువుకుని ఎవరికాళ్ళమీద వాళ్ళు నిలబడగలిగితేనే జీవితం ఒడిదుడుకులు లేకుండా ముందుకి నడవ గలదని చెప్పవచ్చు. మనిషి ఎదుగుదలకి, వ్యక్తిత్వ వికాసానికీ చదువు అవసరం. ఏమంటారు?"

"నూటికి నూరుపాళ్ళూ నిజం మీరన్నమాట. తల్లిదండ్రులకి ఆడపిల్లల్ని చదివించే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్య వైఖరి ఉండకూడదన్నది అనుభవంలో అర్థం చేసుకున్నాను. ఎంతైనా కష్టపడి పరువుగా బతుకుతూ నా కూతుళ్ళని చదివించు కుంటాను. వాళ్ళకి నేనిచ్చే ఆస్తి ఆ చదువే అవుతుంది.

"నేను మీకు మాటసాయానికీ మనిషి సాయానికీ ఎప్పుడూ ఉంటాను. చదువులో వాళ్ళకి ఏ సందేహాలొచ్చినా ఏ పాఠాలు అర్థంకాకపోయినా నా దగ్గిర కొచ్చి చెప్పించుకోవడానికి మొహమాటపడద్దని మీ పిల్లలకి చెప్పండి".

"థ్యాంక్స్ అరుణగారూ! మా పిల్లలే కాదు నేను కూడా మీ దగ్గరకొస్తాను. చదువుకుంటాను" మనస్ఫూర్తిగా చెప్పింది శ్యామల.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారం